

రీడింగ్ రూమ్ పరిశీలన

విశాఖ: ఏయూ రీడింగ్ రూమ్‌ను రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్ సోమవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు.



నేడే మహా బడ్జెట్

విశాఖ: మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జీవీఎంసీ బడ్జెట్ సమావేశం మంగళవారం జరగనుంది.



పోస్టర్ ఆవిష్కరణ

విశాఖ: స్వామి వివేకానంద జయంత్యుత్సవాల పోస్టర్‌ను శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామిజీ ఆవిష్కరించారు.

ముందే వచ్చిన సంక్రాంతి

ముత్యాల ముగ్గులు.. ముచ్చటైన గొబ్బెమ్మలు.. కీర్తన పాడుతూ సాగిపోయే హరిదాసులు.. డూడూ బసవన్నల విన్యాసాలు.. ఇలా సంక్రాంతి సందడంతా సోమవారం పాఠశాలల్లో ప్రతిఫలించింది. మంగళవారం నుంచి సెలవులు ఇస్తుండడంతో జిల్లా అంతటా ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో పెద్ద ఎత్తున ఉత్సవాలు జరిపారు. ఈ కాలం పిల్లలకు సంక్రాంతి విశిష్టత తెలిసేలా ఉపాధ్యాయులు ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు ఆటపాటలతో సరదాగా గడిపారు.

–సాక్షి న్యూస్ నెట్‌వర్క్



అచ్యుతాపురం మండలంలోని ఒక ప్రైవేటు స్కూల్లో రంగవల్లులను తీర్చిదిద్దుతున్న విద్యార్థులు



పాయకరావుపేట మండలం పెదరాంభ్రపురం జెడ్పీ హైస్కూల్లో వేసిన భోగి మంట



కోనాంలోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



నాతవరంలోని ఎం.బి.పట్నం హైస్కూల్లో హరిదాసుకు బియ్యం వేస్తున్న బాలిక

పకడ్బందీగా ప్రయోగ పరీక్షలు

యలమంచిలి రూరల్: వచ్చే నెలలో జరగబోయే ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ప్రయోగ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి బి.సుజాత అధ్యాపకులకు సూచించారు. సోమవారం యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లాకు చెందిన సైన్సు సబ్జెక్టుల అధ్యాపకులకు నిర్వహించిన ప్రయోగ పరీక్షల ఓరియంటేషన్ తరగతులను ఆమె ప్రారంభించారు. ప్రయోగ పరీక్షల నిర్వహణ సమయంలో పాటించాల్సిన నిబంధనలు, ఇంటర్మీడియట్ విద్యామండలి జారీ చేసిన మార్గదర్శకాల గురించి వివరించారు. పరీక్షలకు హాజరు కాబోయే విద్యార్థులంతా ప్రశాంతంగా పరీక్షలు రాసేలా చూడాల్సిన బాధ్యత ఎగ్జామినర్లుగా నియమించబడే అధ్యాపకులపై ఉంటుందని చెప్పారు. జవాబు పత్రాల మూల్యాంకనం నిబంధనల ప్రకారం చేపట్టాలన్నారు.

ఐఎఫ్‌పీలకు ప్రారంభోత్సవం

సర్కారు కళాశాలల్లో ప్రభుత్వం డిజిటల్ విద్య ప్రవేశపెట్టడం శుభపరిణామమని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి బి. సుజాత అభిప్రాయపడ్డారు.



ఐఎఫ్‌పీ ప్యానెళ్లను ప్రారంభిస్తున్న డీఐఈవో సుజాత

సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం సమకూర్చిన కొత్త ఐఎఫ్‌పీ(ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్)లను ఆమె ప్రారంభించారు. ఐఎఫ్‌పీ ప్యానెళ్లతో బోధన మరింత సులభంగా,విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో ఉంటుందన్నారు. పోటీ ప్రపంచంలో ప్రభుత్వ కళాశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులు వెనుకబడకుండా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కళాశాలలో 11తరగతులకు ఐఎఫ్‌పీ ప్యానెళ్లను అమర్చారు. యలమంచిలి, లాలంకోడూరు ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు బి.భాగ్యబతి, ఎం.వెంకటస్వామినాయుడు, చక్రధర్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి పెరిగిన కార్గో ఆదాయం

అనకాపల్లి: ప్రజారవాణాశాఖ (ఆర్టీసీ)లో కార్గో రవాణా ద్వారా జోన్ పరిధిలో గత ఏడాది రూ.15.96 కోట్లు రాగా ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.18.55 కోట్ల ఆదాయం వచ్చిందని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.రవికుమార్ చెప్పారు. స్థానిక ఆర్టీసీ డిపోలో వివిధ విభాగాలను, కార్గో రవాణా కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. వ్యాపారస్తులకు సకాలంలో సరకులు అందజేయడం ద్వారా ఆదాయం పెరుగుతుందన్నారు. జిల్లాలో కార్గో సర్వీసుల ద్వారా గత ఏడాది రూ.కోటి 23 లక్షలు రాగా నేటి వరకు రూ.కోటి 61 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలో ఆర్టీసీకి గత ఏడాది వివిధ రూపాల్లో రూ.63 కోట్ల ఆదాయం రాగా ఈ ఏడాది నేటి వరకు రూ.69 కోట్ల 40 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది సంక్రాంతికి



అనకాపల్లి డిపో గ్యారేజీని పరిశీలిస్తున్న ఈడీ రవికుమార్

ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని వివిధ దూర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. మన రాష్ట్రంలోనే కాకుండా తెలంగాణ, తమిళనాడు, ఒడిశా, కర్నాటక రాష్ట్రాలకు స్పెషల్ బస్సులు నడుపుతున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రజారవాణాశాఖ జిల్లా అధికారి కె.పద్మావతి, గ్యారేజి ఎంఎఫ్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బడులకు నేటి నుంచి సంక్రాంతి సెలవులు

అనకాపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 9 నుంచి 18వ తేదీ వరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ సోమవారం ఓ ప్రకటనలో అన్నారు. ఈనెల 19న పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయని ఆమె పేర్కొన్నారు.

వక్తృత్వ పోటీల్లో విజేతకు జేసీ ప్రశంసలు



గీతామాధురికి ప్రశంసాపత్రం అందిస్తున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి

రోలుగుంట : కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని టి.గీతామాధురి గత నెలలో అనకాపల్లిలో నిర్వహించిన వినియోగదారుల ఫోరం జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో పాల్గొని తన ప్రతిభ చూపించింది. జిల్లాస్థాయి వక్తృత్వ పోటీల్లో ప్రథమస్థానం దక్కించుకుంది. తరువాత విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని తన ప్రతిభ చూపించింది. అందుకుగాను సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జేసీ జాహ్నవి తన చాంబర్‌లో గీతామాధురిని అభినందించారు. ఆమెకు గైడ్‌గా వ్యవహరించిన పాఠశాలకు చెందిన అప్పన రాంబాబుని కూడా అభినందించారు. గీతా మాధురికి ప్రోత్సాహక నగదు రూ.1500లతో పాటు ప్రశంసాపత్రం అందజేశారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి

తుమ్మపాల : భారత ప్రభుత్వ సంస్థ (సీపీఈటీ), ఎన్టీపీసీ సింహాద్రి (విజయవాడ) సౌజన్యంతో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతో కూడిన ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు సీపీఈటీ జాయింట్ డైరెక్టర్, హెడ్ సీహెచ్.శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీపీసీ సింహాద్రి ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామాల్లో స్థానికత ఉండి, 10 వ తరగతి పాసై 18 నుండి 35 ఏళ్ల మధ్య వయస్సు గల 60 మందికి విజయవాడ పోలిమెర్స్ టెక్నాలజీలో 6 నెలల నైపుణ్యాభివృద్ధి శిక్షణతో పాటు సర్టిఫికెట్ అందించనున్నట్లు తెలిపారు. విశాఖపట్నం, అనంతపురం, హైదరాబాద్, బెంగుళూరు, హోసూర్, చెన్నై ప్రాంతాల్లో ప్రముఖ ప్లాస్టిక్స్, అనుబంధ సంస్థలలో ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలతో పాటు నెలకు రూ.3వేలు స్టైఫండ్ ఇస్తామన్నారు. ఆసక్తి గల యువత సీపీఈటీ ప్రతినిధి బాణావత్ అంజి నాయక్‌ని 7893586494 నంబర్‌లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

రుణాలు పక్కదారి పట్టిస్తే క్రిమినల్ కేసులు

- డీఆర్‌డీఏ పీడీ శచీదేవి

మాకవరపాలెం : డ్వాక్రా రుణాలను పక్కదారి పట్టించే వారిపై క్రిమినల్ కేసులు తప్పవని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి స్పష్టం చేశారు. మాకవరపాలెం స్త్రీశక్తి భవనంలో సోమవారం ఆమె వెలుగు సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. రుణాల రికవరీ, రుణాల మంజూరు, తదితర అంశాలకు సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రుణాల మంజూరులో అవకతవకలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు పెడతామన్నారు. జిల్లాలో అవతవకలకు పాల్పడినందుకు తొమ్మిది మందిపై క్రిమినల్ కేసులకు సిఫార్సు చేయగా ఇప్పటికే ఐదుగురిపై కేసులు పెట్టామన్నారు. మండలంలోని రాచపల్లిలో అవకతవకలు జరిగాయంటూ అందిన ఫిర్యాదుపై విచా



విలేకర్లతో మాట్లాడుతున్న పీడీ శచీదేవి

రణ జరుగుతుందన్నారు. పూర్తికాగానే నివేదికలను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. గ్రూపు సభ్యులెవరైనా బ్యాంకు లింకేజీ రుణాలకు సంబంధించిన నగదును పక్కదారి పట్టిస్తే గ్రూపు ఆమోదంతో క్రిమినల్ కేసులు పెట్టొచ్చన్నారు. అవకతవకలకు పాల్పడే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

పేదల పాలిట సంజీవని 'ఆరోగ్యశ్రీ'

బుచ్చెయ్యపేట: లోపూడి సచివాలయ పరిధిలో ఉన్న లోపూడి, బంగారుమెట్ట, ఎల్‌బీ పురం, శింగవరం గ్రామాలకు చెందిన 1,092 కుటుంబాల వారికి కొత్తగా మంజూరైన ఆర్యోశ్రీ కార్డులను విప్ ధర్మశ్రీ సోమవారం పంపిణీ చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ఈ మహాయజ్ఞాన్ని అతని తనయుడు, ప్రస్తుత సీఎం జగన్‌మోహన్ రెడ్డి మరింత మేలు చేసేలా అమలు చేస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షల వరకు పెంచారని, నిరుపేదలకు కూడా కార్పొరేటు వైద్య సేవలు అందుతున్నాయన్నారు. బీఎస్ రోడ్డు నిర్మాణానికి రూ.120 కోట్లు మంజూరు చేయించినా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు ఆలస్యమయ్యాయని, రోడ్డు పనులు పూర్తి చేయించి మీ దగ్గరకు ఓటు కోసం వస్తానని ఆశీర్వదించాలని ధర్మశ్రీ కోరారు. లోపూడిలో జరిగిన వైద్య శిబిరంలో పాలొగని రోగులకు ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో కోఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షుడు సాయం రమేష్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, వైస్ ఎంపీపీ దొండా లలిత, సర్పంచ్‌లు మేరుగు కుమారి బాబూరావు, తమరాన శ్రీను, వేపాడ మధు పాల్గొన్నారు.



లోపూడిలో కొత్త ఆరోగ్యశ్రీ కార్డును అందిస్తున్న విప్ ధర్మశ్రీ

స్పందనకు 485 దరఖాస్తులు



కలెక్టరేట్‌లో స్పందన అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

తుమ్మపాల : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, ఇతర జిల్లా అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలు తిరస్కరిస్తే అందుకు స్పష్టమైన కారణం అర్జీదారులకు తెలియజేయాలన్నారు.

పదేపదే పునరావృతం అవుతున్న ఫిర్యాదులపై మండల స్థాయి అధికారులు పర్యవేక్షణ అవసరమన్నారు. రెండు వారాలుగా స్పందన కార్యక్రమం లేకపోవడంతో సోమవారం మొత్తం 485 దరఖాస్తులు ఫిర్యాదులు నమోదయ్యాయి. అధికంగా భూ సంబంధిత సమస్యలు కాగా, సంక్షేమ పథకాల లబ్ధిపై కూడా వినతులు వచ్చాయి. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి, ప్రత్యేక ఉప కలెక్టర్లు కె.రమామణి, ఎ.మహేష్ పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయానికి 57 అర్జీలు

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందనకు 57 అర్జీలు వచ్చాయి. ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అర్జీదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటూ చట్టపరిధిలో వాటిపై దిగువస్థాయి అధికారులకు ఆదేశాలు జారీచేశారు. భూ తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ వంటివాటిపై అర్జీలు అధికంగా వచ్చినట్లు ఈ సందర్భంగా ఎస్పీ చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఎస్ఐ కె.సావిత్రి పాల్గొన్నారు.

సెక్టోరల్ అధికారులే కీలకం

- ఎన్నికల నిర్వహణ సజావుగా సాగేందుకు దోహదం
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించే అధికారం
- ప్రాథమిక వెరిఫికేషన్ తరువాత పోలింగ్ కేంద్రాల విభజన

సాక్షి, అనకాపల్లి: ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులు, సెక్టోరల్ పోలీస్ అధికారుల పాత్ర అత్యంత కీలకం కానుంది. రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలింగ్ కేంద్రాల సమాచారాన్ని సేకరించడంలో వీరు ప్రధాన పాత్ర పోషించనున్నారు. జిల్లాలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి మ్యాపింగ్ చేస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో అక్కడ నమోదైన ఓటింగ్ శాతం, ఎమ్మెల్యే అభ్యర్థులకు పోలైన ఓట్లు, పోలింగ్ శాతం ఎంత.. మొదలైన వివరాలను సమగ్రంగా విశ్లేషిస్తారు. పోటీలో ఉన్న అభ్యర్థుల్లో ఒకరికే ఎక్కువ మెజారిటీ వచ్చినా.. లేదా ఎక్కువ పోలింగ్ శాతం నమోదైనా.. అలాంటి చోట ప్రత్యేకంగా దృష్టి సారిస్తారు. జిల్లాలో ఉన్న ఒక పార్లమెంట్, 6 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గల మొత్తం 1,529 పోలింగ్ కేంద్రాలను 154 సెక్టార్లుగా విభజించారు. ఒక్కో సెక్టార్ పరిధిలో 10 నుంచి 12 వరకు పోలింగ్ కేంద్రాలుంటాయి.

ప్రతీ సెక్టార్‌కు ఒక సెక్టోరల్ అధికారి, సెక్టోరల్ పోలీస్ అధికారి, 10 నుంచి 12 మంది బీఎల్వోలు, ఈఆర్వో, ఏఈఆర్వోలు ఉంటారు. వీరు ప్రతీ పోలింగ్ కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. ఇప్పటికే వీరికి శిక్షణ కూడా అందించారు.



మెజిస్టీరియల్ అధికారాలు

జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి అయిన కలెక్టర్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ల పరిధిలో సెక్టోరల్ అధికారి, సెక్టోరల్ పోలీస్ అధికారులు పనిచేస్తుంటారు. సెక్టోరల్ అధికారిగా ఇంజినీర్లు, సెక్టోరల్ పోలీసు అధికారిగా ఎస్సై లేదా ఏఎస్సై ఉంటారు. వీరికి మెజిస్టీరియల్ అధికారాలు ఉంటాయి. ప్రతీ పోలింగ్ కేంద్రానికి వీఆర్వో గానీ, సచివాలయ ఉద్యోగి గాని బీఎల్వో గాని ఉంటారు. జిల్లాలోని 6 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,529 పోలింగ్ కేంద్రాలు, 154 సెక్టార్ల పరిధిలో 16మంది నోడల్ అధికారులు, 2,596మంది బీఎల్వోలు, 112మంది ఈఆర్వోలు, 398 ఏఈఆర్వోలు, 203 స్పెషల్ ఆఫీసర్లు, 1492 సూపర్‌వైజర్లు ఉన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా సెక్టోరల్ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటారు. ఆ ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులు, సంఘ వ్యతిరేక కార్యక్రమాలు మొదలైన వాటిని గుర్తిస్తారు. ఎన్నికల నియమ నిబంధనలను అనుసరిస్తూ ప్రశాంత వాతావరణం కల్పించేలా సూచనలు చేస్తారు. క్షేత్ర స్థాయి సమస్యలను ముందుగా జిల్లా ఎన్నికల అధికారికి తెలియపరుస్తారు. అధికారులను సమన్వయం చేస్తూ పోలింగ్ నిర్వహణకు సిద్ధం చేయడంలో ముఖ్య భూమిక పోషిస్తారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలింగ్



పోలింగ్ కేంద్రాలలో విద్యుత్, నీరు, వికలాంగులకు ర్యాంపు సౌకర్యం మొదలైనవి తప్పనిసరిగా ఉండాలి. పోలింగ్ కేంద్రాల పరిస్థితిని ఎప్పటికప్పుడు తనిఖీ చేసి, లోటుపాట్లు ఉంటే సరిచేస్తాం. అవసరమైనచోట్ల అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడానికి పరిశీలన చేస్తున్నాం. ఇప్పటికే రెండు విడతల్లో సెక్టోరల్ అధికారి, సెక్టోరల్ పోలీస్ అధికారులకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చాం. వారు ఆయా పోలింగ్ కేంద్రాలకు నియమించిన బీఎల్వోలతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నారు. ఇప్పటికే మూడు పర్యాయాలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఓటు వేయడానికి వచ్చే ఓటర్లకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలన్నదే మా ప్రధాన లక్ష్యం. ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుంది.

– రవి పట్టాన్‌శెట్టి, కలెక్టర్

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు వేచలం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో పీడీ తమ్మునాయుడు

దేవరాపల్లి: జాతీయ స్థాయి క్రీడా పోటీలకు వేచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు డి.నర్సింహమూర్తి, పీడీ రావాడ తమ్మునాయుడు తెలిపారు. విశాఖపట్నం రైల్వే గ్రౌండ్‌లో ఇటీవల ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో జరిగిన జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో పదో తరగతి విద్యార్థి కె.సాయి కార్తికేయ పెంటాథ్లీన్ విభాగంలో, తొమ్మిదో తరగతి విద్యార్థి డి.గణేష్ 60 మీటర్ల రన్నింగ్‌లో విశేష ప్రతిభ కనబరిచారు. వీరిద్దరూ జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారని హెచ్‌ఎం, పీడీ తెలిపారు. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో ఫిబ్రవరి 16 నుంచి జరిగే నేషనల్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో వీరు పాల్గొంటారన్నారు.విద్యార్థులను క్రీడాపరంగా ప్రోత్సహిస్తూ సహాయ సహకారాలు అందించిన సిరి ఫౌండేషన్ ప్రతినిధులకు హెచ్‌ఎం, పీడీ కృతజ్ఞతలు తెలియజేశారు.

తల్లిని ఆస్పత్రికి తీసుకెళ్లి వస్తూ..

- గుండెపోటుతో కార్యదర్శి హఠాన్మరణం

కోటవురట్ల: తల్లిని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించి తిరిగి వస్తూ.. పంచాయతీ కార్యదర్శి బి.సుబ్రహ్మణ్యం (62) కారులోనే గుండెపోటుతో మృతి చెందారు. కోటవురట్ల మేజర్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయన సోమవారం తన తల్లిని నర్సీపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అనంతరం తిరుగు పయనమై కారు ఎక్కి బయలుదేరే సమయంలో ఒక్కసారిగా సీటులో కుప్పకూలిపోయారు. వెంటనే ఆయనను స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. తల్లికి చికిత్స చేయించి తిరిగి వస్తూ తనయుడు గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన స్వగ్రామం గొలుగొండ మండలం అమ్మపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన సుదీర్ఘ కాలం కోటవురట్లలో కార్యదర్శిగా పనిచేశారు. మరో 5 నెలల్లో ఉద్యోగ విరమణ చేయనుండగా ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. సౌమ్యుడిగా, మంచి అధికారిగా అందరి మన్ననలు పొందిన ఆయన మృతితో కోటవురట్ల మండలంలోనూ విషాదం అలుముకుంది. సహచర ఉద్యోగులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయనకు భార్య సుబ్బలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



సుబ్రహ్మణ్యం (ఫైల్)

రాష్ట్ర స్థాయి పోటీల్లో మెరిసిన 'ముత్యం'

చోడవరం రూరల్: సెంచరీకి చేరువలో ఉన్న ముదిమి వయసు ఆమె క్రీడాభిలాషకు పగ్గం వేయలేకపోయింది. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వివిధ అంశాల్లో పాల్గొనడమే గాకుండా ముచ్చటగా మూడు అంశాల్లో ప్రథమ స్థానాలను కైవసం చేసుకున్న ఆమె వయసు 85 వసంతాలు. వెటరన్ క్రీడాకారిణి ముత్యం లక్ష్మి అథ్లెటిక్స్‌లో ముత్యంలా మెరిశారు. విశాఖపట్నం రైల్వే న్యూకాలనీలో రైల్వే గ్రౌండ్సులో జరిగిన 41వ ఏపీ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్–2024 పోటీల్లో 85 ఏళ్ల పైబడిన విభాగంలో పాల్గొన్న ముత్యం లక్ష్మి మూడు అంశాల్లో ప్రథమ స్థానాలను కైవసం చేసుకున్నారు. షాట్‌పుట్, జావెలిన్, డిస్క్ త్రో పోటీల్లో ప్రతిభ చూపారు.



పతకాలతో ముత్యం లక్ష్మి

నదిలో దూకినట్టుగా..

- చెప్పులు, బ్యాగు విడిచి యువకుడి అదృశ్యం

ఎస్.రాయవరం: ఆన్‌లైన్ గేమ్స్‌లో డబ్బులు పోగొట్టుకున్న యువకుడు తన తల్లిదండ్రులు కొడతారని భయంతో వరాహనది బ్రిడ్జిపై బ్యాగు, చెప్పులు విడిచిపెట్టి సినీ ఫక్కీలో మాయమయ్యాడు. అతడి ఆచూకీ కోసం పోలీసు గాలింపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎస్ఐ ప్రసాదరావు వివరాల ప్రకారం.. ఎస్. రాయవరానికి చెందిన యూ మణికంఠ(30)పి.ధర్మవరం వరాహనది బ్రిడ్జిపై బ్యాగు, చెప్పులు వదిలి పెట్టాడు. వీటిని చూసిన స్థానికులు నదిలో సదరు యువకుడు దూకి ఆత్మహత్యకు పాల్పడినట్టు అనుమానించారు. సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ స్థానిక మత్స్యకారులతో నదిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రానికి సీసీ కెమెరాలో నమోదైన దృశ్యాలను పరిశీలించారు. అయితే నదిలో దూకే ప్రయత్నం చేసి దూకకుండా తుని వైపు వెళ్లినట్టు గుర్తించారు. అయినప్పటికీ అతడి ఆచూకీ తెలియకపోవడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

కుమార్తె వద్దకు వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

- రూ.లక్ష నగదు, 10 తులాల వెండి చోరీ

అనకాపల్లి: మండలంలో జాతీయ రహదారికి ఆనుకున్న కొత్తూరు గ్రామంలో నివసిస్తున్న నగిరెడ్డి లక్ష్మి ఇంట్లో రూ.లక్షతోపాటు పది తులాల వెండి చోరీకి గురయ్యాయి. పట్టణ సీఐ దాడి మోహన్‌రావు వివరాల ప్రకారం... ఈ నెల 6న మామిడిపాలెంలో నివసిస్తున్న కుమార్తె ఇంటికి బాధితురాలు లక్ష్మి వెళ్లింది. సోమవారం వచ్చి చూసేసరికి ఇంటి మేడపై నుంచి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి చోరీకి పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డాక్టర్ జగన్నాథరావుకు ప్రతిష్టాత్మక అవార్డు

తుమ్మపాల: ఫెలో ఆఫ్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ –2023 అవార్డును అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ పరిశోధన సంచాలకుడు డాక్టర్ పి.వి.కె.జగన్నాథరావుకు బహూకరించారు. ఫెలో ఆఫ్ ఇండియన్ సొసైటీ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ అవార్డుల ప్రదానోత్సవం కర్ణాటక రాష్ట్రంలో ఇటీవల జరిగింది. రైతులకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసి, ప్రాసెసింగ్ మిషనరీ వంటి అనేక సేవలు అందించినందుకు గాను బహుమతి ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



అవార్డును స్వీకరిస్తున్న జగన్నాథరావు

మాకవరపాలెంలో మహిళా మార్టు ప్రారంభం



మార్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణేష్, ఎంపీపీ

మాకవరపాలెం: డ్వాక్రా సభ్యుల షేర్ ధనంతో ఏర్పాటు చేసిన వైఎస్సార్ చేయూత మహిళా మార్టును నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సోమవారం ప్రారంభించారు. మాకవరపాలెం మండలంలో 1,299 డ్వాక్రా సంఘాలకు చెందిన 14,050 మంది సభ్యులు సమకూర్చిన 35 లక్షల 12,500 రూపాయలతో దీన్ని ఏర్పాటు చేశారు. ఈ మార్టులో సరుకులను కొనుగోలు చేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక్కడ మార్టులో ప్రజలంతా సరుకులను కొనుగోలు చేసుకోవాలని సూచించారు. ఇతర దుకాణాల కంటే తక్కువ ధరకు ఇంటి సామగ్రి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ సచీదేవి, ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బొడ్డు గోవింద, సచివాలయాల మండల కన్వీనర్ రమణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ భద్రాచలం, మూకల బాలకృష్ణ, చేయూత డీపీఎం వరప్రసాద్, జీవనోపాధుల డీపీఎం శ్రీనివాస్, నర్సీపట్నం ఏరియా కో ఆర్డినేటర్ సత్యనారాయణ, ఏపీఎం చినబాబు పాల్గొన్నారు.

త్వరలో అడ్డురోడ్డులో..

జిల్లాలో మాడుగుల, సబ్బవరం, చోడవరం, మాకవరపాలెంలో వైఎస్సార్ చేయూత మహిళా మార్టులను ప్రారంభించామని పీడీ శచీదేవి తెలిపారు. అడ్డురోడ్డులో త్వరలో ప్రారంభిస్తామన్నారు. మాడుగుల మార్టులో నెలకు రూ.37 లక్షల వరకు విక్రయాలతో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు.

క్లుప్తంగా

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

అనకాపల్లి: మండలంలోని తుమ్మపాల–1 సచివాలయం పరిధిలో మంగళవారం ఉదయం 9 నుంచి 5 గంటల వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.నరసింహారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫ్యామిలీ వైద్యుడు, ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు, కంటి వైద్యులు పాల్గొంటారన్నారు. ఉచిత వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేసి, అవసరమైన రోగులను పెద్ద ఆస్పత్రికి తరలిస్తారని చెప్పారు.

లారీకి విద్యుత్ వైర్లు తగిలి అగ్నిప్రమాదం

అనకాపల్లి: స్థానిక జాతీయ రహదారి డైట్ కళాశాల వద్ద విద్యుత్ వైర్లకు టిప్పర్ లారీ లిఫ్ట్ తగిలి అగ్నిప్రమాదం జరిగినట్లు పట్టణ పోలీస్‌లకు సోమవారం ఫిర్యాదు అందింది. సీఐ దాడి మోహన్‌రావు తెలిపిన వివరాలిలా.. డైట్ కళాశాల వద్ద లారీ టిప్పర్ నుంచి లోడ్‌ను అన్‌లోడ్ చేస్తున్న సమయంలో అటుగా వెళ్లుతున్న విద్యుత్ వైర్లకు లారీ తగలడంతో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో లారీ అగ్నికి ఆహుతైనట్లు డ్రైవర్ శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. సుమారుగా రూ.8 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు.

జూడో క్రీడా సంఘ కొత్త కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

తుమ్మపాల: జిల్లా జూడో క్రీడా సంఘం నూతన కార్యవర్గ ప్రెసిడెంట్‌గా వనం సన్యాసిరావు ఎన్నికైనట్లు రాష్ట్ర జూడో క్రీడా సంఘం పరిశీలకుడు, ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పాండ్రంగి రుక్మాకరరావు తెలిపారు. కోడూరులోని జూడో క్రీడా కార్యాలయంలో సోమవారం నూతన కార్యవర్గ సమావేశం, ఎన్నికలు నిర్వహించారు. కొత్త కార్యవర్గాన్ని నియమించినట్లు ఆయన తెలిపారు. వైస్ ప్రెసిడెంట్‌గా గొట్టాపు బలరాంనాయుడు, సెక్రటరీ రాకోటి సిమ్మోన్, జాయింట్ సెక్రటరీగా శానాపతి ప్రసాద్, ట్రెజరర్‌గా గొరపల్లి దేవివరలక్ష్మి, జాయింట్ ట్రెజరర్‌గా యల్లబిల్లి రాజు, పలువురు సభ్యులుగా నియమితులయ్యారన్నారు.

వాసవీ వనిత క్లబ్ అధ్యక్షురాలిగా జంగాల ఫణి



జంగాల ఫణి, ఇతర సభ్యులు

అనకాపల్లి: వాసవీ వనిత క్లబ్ అధ్యక్షురాలుగా జంగాల ఫణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మెయిన్ రోడ్డు వైఎంవీఏ హాలులో సోమవారం జరిగిన ఎన్నికల్లో క్లబ్ కార్యదర్శిగా జి.సువర్ణ, కోశాధికారిగా డి.సునీతలు ఎన్నికయ్యారు. ముఖ్య అతిథి వాసవీ క్లబ్ గవర్నర్ వై.నరసింహారావు నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. పై కమిటీ ఎన్నిక ఏడాదిపాటు ఉంటుందన్నారు. 2024 ఏడాదిలో వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలకు శక్తి వంచన లేకుండా కృషిచేస్తామని జంగాల ఫణి తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సీనియర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

బబుల్ గమ్	రాజా
దీనమ్మ జీవితం	సత్యనారాయణస్క్రీన్-2
డెవిల్	షిర్డిసాయి
సలార్	పర్తిసాయి
రాఘవరెడ్డి	వెంకటేశ్వర
తికమక తాండ	శ్రీసత్య
సలార్	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 14,939 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,600	4,570
మొదటి రకం	3,760	4,230
రెండో రకం	3,640	3,850
మూడోరకం	3,400	3,700

సంక్రాంతి సందడి

- పాఠశాలల్లో ఘనంగా ముందస్తు వేడుకలు
- ముచ్చటైన ముగ్గులు వేసి.. భోగి మంటలు వెలిగించిన విద్యార్థులు



కశింకోట డీపీఎన్ హైస్కూల్‌లో సంక్రాంతి సంప్రదాయ వేషధారణల్లో విద్యార్థులు

కశింకోట: కశింకోటలోని డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. హెచ్ఎం ఎం.ఆర్.వి. అప్పారావు ఆధ్వర్యంలో బాలికలకు ముగ్గులు, బాలురకు పతంగులు ఎగుర వేయడంలో పోటీలు నిర్వహించారు. విద్యార్థులు సంక్రాంతి శోభను గుర్తు చేస్తూ భోగి మంటలు వేసి సందడి చేశారు. హరిదాసు, కొమ్మ దాసరి, బుడబుక్కల వేషం, గంగిరెద్దుల వేషం, సోది తదితర సంప్రదాయ వేషధారణలతో ఆహుతులను విశేషంగా అలరించారు. సంక్రాంతి ప్రాధాన్యాన్నా తెలియజేస్తూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆచంట రవి, బి.అప్పారావు, బి.ఆనంద్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వెదురుపర్తి హైస్కూల్‌లో వినూత్నంగా..

వెదురుపర్తి హైస్కూల్‌లో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సైన్స్, సోషల్, స్పోర్ట్స్ సబ్జెక్టులకు సంబంధించిన వివిధ అంశాలను నమూనాలుగా విద్యార్థులు రంగులతో నేలపై గీసి, వాటి భావాలు ఆకట్టుకునేలా వివరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం జి.వి.కె.ఆచారి మాట్లాడుతూ అన్ని సబ్జెక్టులకు సంబంధించిన నమూనాలను గీయడం వంటి పద్ధతి వల్ల విద్యార్థుల్లో చేతి నైపుణ్యం, అవగాహన, మాట్లాడే విధానం వృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉడ్‌పేట పాఠశాలలో సంబరాలు

అనకాపల్లి: స్థానిక ఉడ్‌పేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు సోమవారం ఘనంగా జరిగాయి. చిన్నారులు సంక్రాంతి కలను ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తులు ధరించి భోగి మంటలు వెలిగించారు. హరిదాసు కీర్తనలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులపై భోగిపళ్లు వేశారు. పాలు పొంగించి పాయసం చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బలిరెడ్డి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వెదురుపర్తి హైస్కూల్‌లో విద్యార్థులు వేసిన పాఠ్యాంశాలకు సంబంధించిన నమూనా రంగవల్లులు



ఉడ్‌పేట పాఠశాల ఆవరణలో భోగి మంట వెలిగిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



ఉడ్‌పేట స్కూల్‌లో హరిదాసు వేషధారణలో విద్యార్థి, పతంగులతో పిల్లల సందడి

రోగులకు సకాలంలో వైద్య సేవలు



రోగితో మాట్లాడుతున్న కమిటీ డైరెక్టర్ రామ్మూర్తి, ఆర్ఎంవో లక్ష్మణ శ్రీనివాస్

అనకాపల్లి: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించి వారి మన్ననలు పొందాలని ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి అన్నారు. సోమవారం ఆస్పత్రిలో వివిధ విభాగాలను పరిశీలించి వార్డులో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల కారణంగా జ్వరాలు, దగ్గుతో ఆస్పత్రికి వస్తున్న రోగులకు సకాలంలో వైద్యులు, సిబ్బంది పూర్తిస్థాయిలో వైద్యం అందించాలన్నారు. వైద్యాలయంలో సుమారుగా రూ.2 కోట్ల నిధులతో సీటీ స్కానింగ్ మిషన్ ఏర్పాటు చేశారని, రోగులకు అందుబాటులోనికి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించామని చెప్పారు. త్వరలోనే ఈ మిషన్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. రామ్మూర్తి వెంట ఆర్ఎంవో లక్ష్మణ శ్రీనివాస్, వైద్య సిబ్బంది ఉన్నారు.

కష్టపడి పనిచేస్తే గుర్తింపు



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

కశింకోట: కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తప్పక గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. తాళ్లపాలెంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం రాత్రి పార్టీ శ్రేణులతో ఆయన పరిచయం చేసుకొని మేమకమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధికి, సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో సైతం అభివృద్ధికి దోహదంగా నిలుస్తున్నారని చెప్పారు. ఈ విషయాన్ని గ్రామాల్లో శ్రేణులు ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి, వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి కృషి చేయాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ కలగ గున్నయ్యనాయుడు, పార్టీ నాయకులు లగిశెట్టి గణేష్, మట్టా సత్తిబాబు, గుమ్మడి నారాయణరావు, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే తప్పడు రాతలు



మాట్లాడుతున్న బొడ్డేడ శివ, లక్ష్మీనరసింహారావు

అనకాపల్లి: రాష్ట్రాభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రజలను ఏమారుస్తూ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహారావు అన్నారు. ప్రజల్లోకి అభివృద్ధి పనులను వెళ్లనివ్వకుండా వారిని తప్పుదోవ పట్టించేలా తప్పుడు రాతలు రాయిస్తున్నారని ఆరోపించారు. గవరపాలెంలోని కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీలకు అతీతంగా అర్హతే కొలమానంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో కొన్ని పత్రికలు ప్రభుత్వంపై తప్పుడు రాతలతో ప్రజలను మోసం చేసేందుకు సిద్ధపడుతున్నాయని, ఇది తగదని పేర్కొన్నారు. భావితరాల విద్యార్థులను, ప్రజలను దృష్టిలో పెట్టుకుని అనేక సంక్షేమ పథకాలు, నాడు–నేడులో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అభివృద్ధిని చూసి మరోసారి ఆయనను గెలిపించుకొనే బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సూర్యనారాయణమూర్తి దేవస్థానం చైర్మన్ కె.ఎం.నాయుడు, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి దాడి నారాయణరావు, నూకాంబిక అమ్మవారి దేవస్థానం ధర్మకర్త బుద్ద నరసింగరావు, భోగలింగేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తలు వాసుపల్లి తాతీయులు, బుద్ద మురళీ తదితరులు పాల్గొన్నారు.

వారపు సంతకు సంక్రాంతి కళ



తాళ్లపాలెం వారపు సంతలో వస్త్ర దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంత సోమవారం సంక్రాంతి కళను సంతరించుకుంది. ప్రధానంగా వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడాయి. సంక్రాంతి పండగకు పెద్దలకు సంప్రదాయ వస్త్రాలు పెట్టడం, నూతన వస్త్రాలు ధరించడం సంప్రదాయం. ఈ నేపథ్యంలో సంతకు మండలంతోపాటు బుచ్చియ్యపేట, రావికమతం, మాకవరపాలెం తదితర మండలాల గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు చీరలు, రవికెలు, రెడీమేడ్ వస్త్రాలు, తదితర వాటిని ఎక్కువగా కొనుగోలు చేశారు. పండగలో వినియోగించే గుమ్మడి పండ్లు, పెండ్లం దుంపలు, ఇతర కూరగాయలను ఎక్కువగా కొనుగోలు చేశారు. గొర్రెలు, మేకల అమ్మకాలు సాధారణంగానే సాగాయి. కూరగాయల ధరలు దాదాపు నిలకడగానే ఉన్నాయి.

పీఎం విశ్వకర్మ పథకానికి 600 దరఖాస్తులు



కశింకోట సచివాలయంలో దరఖాస్తులు అందించడానికి వచ్చిన మహిళలు

కశింకోట: కశింకోటలోని సచివాలయంలో పీఎం విశ్వకర్మ పథకానికి వెల్లువలా దరఖాస్తు చేస్తున్నారు. సోమవారం అధిక సంఖ్యలో మహిళలు దరఖాస్తు చేశారు. చేతివృత్తుల వారికి ఈ పథకంలో 15 రోజుల వరకు శిక్షణ ఇచ్చి రూ.15,000 ఆర్థిక సాయం అందివ్వడంతోపాటు వృత్తిని అనుసరించి మొదట రూ.లక్ష వరకు రుణాన్ని అందివ్వనున్నారు. దాన్ని సక్రమంగా చెల్లిస్తే మళ్లీ రూ.3 లక్షల వరకు రుణాన్ని అందిస్తారు. ఈ నేపథ్యంలో ఈ పథకానికి కొద్ది రోజులుగా వెల్లువలా దరఖాస్తులు చేస్తున్నారు. ఈ పథకం కింద కశింకోట నాలుగు సచివాలయాల పరిధిలో సుమారుగా 600 దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. వాటిని సచివాలయ సిబ్బంది సేకరిస్తున్నారు. దరఖాస్తుతోపాటు జత చేయాల్సిన ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు అకౌంట్ పుస్తకం, జెరాక్స్ కాపీలను పరిశీలించి స్వీకరిస్తున్నారు. దరఖాస్తు చేయడానికి తుది గడువు ఇంకా ఇవ్వలేదని, ఇంకా దరఖాస్తు చేసుకోవచ్చునని సిబ్బంది తెలిపారు.

పేదల సొంతింటి కల సాకారం



మామిడిపాలెంలో జగనన్న గృహ లబ్ధిదారుడితో మాట్లాడుతున్న జాజుల రమేష్

అనకాపల్లి: పేదల సొంతింటి కల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే నెరవేరిందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ అన్నారు. మండలంలోని మామిడిపాలెంలో నిర్మిస్తున్న జగనన్న గృహాలను సోమవారం 83వ వార్డు పరిధిలో లబ్ధిదారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న గృహాల్లో 50 శాతం పనులు పూర్తయ్యాయని, మూడు నెలల్లో లబ్ధిదారులు గృహప్రవేశాలు చేయవచ్చని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో దుష్టశక్తులు మీ ఇంటి చుట్టూ తిరుగుతూ కల్లబొల్లి మాటలు చెప్పి ప్రభుత్వంపై బురద జల్లేలా మాట్లాడతారని, వాటిని నమ్మిమోసపోవద్దని రమేష్ హితవుపలికారు. మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుని మరిని సంక్షేమ పథకాలు పొందాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఉగ్గిన అప్పారావు, ప్రధాన కార్యదర్శులు నడిశెట్టి మధు, కారుకుండి కన్నబాబు, జగనన్న గృహాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం



తాళ్లపాలెం సంతలో కాలిపోయిన పూరిల్లును పరిశీలిస్తున్న సమన్వయకర్త భరత్‌కుమార్



బాధిత కుటుంబానికి నిత్యావసర సరకులు, రూ.10 వేల నగదు అందిస్తున్న మలసాల భరత్‌కుమార్

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం సంతలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. ఈ ఘటనలో నిరుపేద కుటుంబం నిరాశ్రయులు కావడంతో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ తక్షణమే స్పందించి ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు. సంతలో ప్రమాదవశాత్తు అన్నంపు రెడ్డి వెంకటరమణకు చెందిన పూరిల్లు అగ్నికి ఆహుతైంది. విషయం తెలుసుకున్న ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిరాశ్రయులైన కుటుంబానికి సొంత ఖర్చుతో నిత్యావసర సరకులు, రూ.10 వేల నగదు సాయాన్ని అందజేశారు. ప్రభుత్వం నుంచి సాయం అందడానికి, పక్కా ఇల్లు మంజూరు కావడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, సర్పంచ్‌లు కలగ గున్నయ్యనాయుడు, వెంకట్, పార్టీ యువజన నాయకులు లగిశెట్టి గణేష్, చిన్ని రాజీవ్, ఇందల ముసిలినాయుడు, గుమ్మడి నారాయణరావు, మాజీ సర్పంచ్ చిన్ని వల్లభ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన కొత్త కమిటీలు



గౌరీ పంచాయతీ దేవస్థానం కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న కొణతాల లక్ష్మీనారాయణ

అనకాపల్లి: గవరపాలెం గౌరీ పంచాయతీ దేవస్థానం, గౌరీ సేవా సంఘం, కొణతాల సుబ్రహ్మణ్యం ఏసీ కల్యాణ మండపం, మళ్ల జగన్నాథరావు కల్యాణ మండపాల నూతన పాలకవర్గ కమిటీల ఎన్నికలు, ప్రమాణ స్వీకారం సోమవారం జరిగాయి. గౌరీ పంచాయతన దేవస్థానం అధ్యక్షుడిగా కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శిగా బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారిగా శరగడం జగదీష్ తోపాటు మరో 22 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. కొణతాల ఏసీ కల్యాణ మండపం కన్వీనర్‌గా ఆళ్ల మహాలక్ష్మీనాయుడు, అయ్యప్పస్వామి దేవాలయం కన్వీనర్‌గా మళ్ల సూర్యప్రకాష్, మళ్ల జగన్నాథ కల్యాణ మండపం నిర్మాణ కమిటీ కన్వీనర్‌గా పెంటకోట సుబ్రహ్మణ్యం, కో కన్వీనర్‌గా బుద్ద రమణాజీ, శ్రీ గౌరీ గీతా మహిళా మండలి కన్వీనర్‌గా కొణతాల శివకుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీల సభ్యులతో వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ(పెద్దబాబు) ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కర్రి సన్యాసినాయుడు మాట్లాడుతూ కమిటీ సభ్యుల సహకారంతో గౌరీ సేవా సంఘాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. పై కమిటీల పదవీ కాలం రెండేళ్ల పాటు ఉంటుందని చెప్పారు.

రామ్‌కో సిమెంట్ పరిశ్రమకు బీఐఎస్ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న పరిశ్రమ డీజీఎం సురేష్‌కుమార్

కశింకోట: మండలంలోని ఏఎస్ పేట వద్ద ఉన్న రామ్‌కో సిమెంట్ పరిశ్రమకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) పురస్కారం లభించింది. సిమెంట్ తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సిమెంట్ ఉత్పత్తి చేస్తున్నందుకు గుర్తింపుగా పురస్కారం లభించినట్లు పరిశ్రమ సీనియర్ జనరల్ మేనేజర్ పి.వీరపాండియన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.కళాధరరావు సోమవారం తెలిపారు. విజయవాడలోని బీఐఎస్ సీనియర్ డైరెక్టర్ ఎం.ఎ.జె. వినోద్ చేతుల మీదుగా పరిశ్రమ డిప్యూటీ జనరల్ మేనేజర్ సి.హెచ్.సురేష్‌కుమార్ పురస్కారాన్ని అందుకున్నారు. ఉద్యోగులు, కార్మికుల సమష్టి కృషి ఫలితంగా పురస్కారాన్ని సాధించామని ఈ సందర్భంగా తెలిపారు.

అంబేడ్కర్ ఫ్లెక్సీపై సంతకాల సేకరణ



ఫ్లెక్సీపై సంతకం చేస్తున్న సర్పంచ్ మంత్రి జయరజని

కశింకోట: మండల సచివాలయాల్లో సోమవారం భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కశింకోట పంచాయతీ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ మంత్రి జయరజని ప్రారంభించి సంతకం చేశారు. అంబేడ్కర్ నిర్దేశించిన సామాజిక న్యాయ మార్గంలో నడుస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నినాదంతో రూపొందించిన ఫ్లెక్సీపై సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. తాళ్లపాలెం, ఇతర సచివాలయాల్లో కూడా సంతకాల సేకరణ జరిపారు.

సీపీఎం నేత బాలకృష్ణకు నివాళి



బాలకృష్ణ సంతాప సభలో పాల్గొన్న పలు సంఘాల నేతలు

అనకాపల్లి: స్థానిక నెహ్రూచౌక్‌లో దివంగత సీపీఎం సీనియర్ నాయకుడు అంగులూరి బాలకృష్ణ చిత్రపటానికి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు సంఘాల నేతలు మాట్లాడుతూ నేటి యువత బాలకృష్ణ ఆశయ సాధనకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ముందుగా సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో పలు సంఘాల నేతలు వై.ఎన్.భద్రం, దాకారపు శ్రీనివాస్, కర్రి రామకృష్ణ, కనిశెట్టి సురేష్‌బాబు, ఎస్.వి.వి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా నూక అప్పారావు

అనకాపల్లి: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా కట్టమూరి నూక అప్పారావును నియమిస్తూ పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి సోమవారం ఆయనకు ఉత్తర్వులు అందాయి. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా నూక అప్పారావు అన్నారు.